
# ఈ వారం కథ



# కుక్క

— కప్పగంతుల మల్లికార్జునరావు

**త**ల్లికి వైద్యం చేయించటానికి ప్రావిడెంట్ ఫండ్‌లో నుంచి అప్పుకావాలని మధుసూదన్ అప్లికేషన్ పెడ్తే ఆరోజు ప్రిన్సిపాల్ తిరస్కరించాడు.

"మదర్' డిపెండెంట్ కిందికి రాదు. భార్యకు జబ్బు అని డాక్టర్ సర్టిఫికేట్ పెట్టు. శాంక్షన్ చేస్తాను."

"నాకసలు పెళ్లే కాలేదుకదా?"

"అయితే పెళ్లిచేసుకొని అప్పుకోసం అప్లైచెయ్యి"

"నాకు తండ్రి లేడు. నా తల్లికి నేనొక్కడినే కొడుకును. ఆమె నాకు డిపెండెంట్ ఎందుకు కాదు?"

"వాదనొద్దు. రూల్సు ప్రకారం రాదు. అదంతే"

ఆ విషయాన్ని మా గ్రూపువాళ్లం చాలాసేపు చర్చించాము.

కాలేజీలో మా గ్రూపుకు 'ఇంటలెక్చ్యువల్ గ్రూప్' అన్న పేరు వుంది. రష్యాలో రిపబ్లిక్‌లు స్వాతంత్రం ప్రకటించుకోటం దగ్గరి నుంచి, ఓజోన్ ఎఫెక్ట్, మా కాలేజీలో గోడలకు చేసింది 'వైట్‌వాష్' లేక 'బ్లేక్‌వాష్' వరకు అనేక విషయాలను చర్చించటం మా హాబీ.

అలసిపోయి మేమంతా ఆగిపోయాక సాంబశివం తాపీగా మొదలుపెట్టేడు

"రూలనేది ఒక బ్రహ్మ పదార్థం లాంటిది. అవాఙ్మానస గోచరమైనది. మనిషినిబట్టి రూలు మారుతుంటుంది. చూచేవాడి దృష్టినిబట్టి రూలన్నది రకరకాల రూపాలలో కన్పిస్తుంటుంది. మంచి రూలు, చెడ్డరూలు అని రూల్సు. రెండే రకములు అని అనుకోటం మన భ్రమ. దేవతలందరూ మంచి వారు, అసురులందరూ చెడ్డవారు అనే వీలుందా? అసురుల్లో మంచివారు దేవతల్లో చెడ్డవారు వున్నారు. అలాగే కుక్కలన్నీ విశ్వాసపాత్రమైనవని, గోవులన్నీ సాధు జంతువులని చెప్పే వీలులేదుకదా? మనుష్యులందరికీ మెదడు, హృదయం వుందని చెప్పే వీలు లేదని ఏనాడో ప్రూవ్ అయింది. సో-ఎవ్విరి రూల్ విత్ హేవ్ ఇట్స్ ఎక్స్‌పెషన్స్. కావాలంటే వో కథ చెప్తాను వినండి-

అందరూ యూనివర్సల్ సత్యాలని అంగీకరించినవాటిని సాంబశివం కాదంటాడు. కథలు చెప్పి తన పాయింట్‌ను ప్రూవ్ చేస్తాడు. మా గ్రూపులో అతనో జీనియస్.

సాంబశివం వో క్షణం ఆగి సిగరెట్ వెలిగించి కథ చెప్పటం ఆరంభించాడు.

... ... ...

ఆకలిగొన్నవాడి కడుపులా పైడమ్మ గుండె మండుతోంది.

'ఛీ. దొంగన్నంజా. త్రాగి ఇంటికొచ్చిన మొగుడికి ఇంతత్తిండి పెట్టలేని నువ్వేం పతివ్రాతివ్వే? అరె-నేనేం కోడికూర క్కావాలన్నానా? మటన్ కావాలన్నానా? రొయ్యేపులుసు కావాలన్నానా? ఆ నా కొడుకులెవరో తినిపారేసిన ఎంగిలి మెతుకులు నాలుగు పెట్టయే అన్నాను. అది నా తప్పంటే, అన్నం అడిగినందుకు నేను విలన్నా? రౌడీ నాకొడుకునా? అన్నంతినే అక్కు నాకు నేదంటే? ఆ అక్కు నాకునేదని ఏ దొంగనాయాలు సెప్తాడో సెప్పమను. నాలిక కోసేస్తానంతే-నాకొడుకుని. అదేమంటే కుక్క తినిపోయిందని అబద్దాలు సెప్తావ్? రోజూ కుక్క ఏడ్నుంచి వస్తుందే దొంగనంజా. ఈ బూపెపంచకంలో డబ్బున్న నాకొడుకులింతమంది వుండగా ఆ కుక్కముండకు మనిల్లే దొరికిందా? కుక్కనేదు- గాడిదగుడ్డూ నేదు. కడుపునిండా నువ్వే బాగా మెక్కి వుంటావ్? అవునా? నువ్వే కుక్కవు. పెద్ద కుక్కవు. ఊరకుక్కవు. అవునా?''

నర్సయ్యకు తిండి లేకపోతే పెళ్లాం మీద కోపం వచ్చి చావబాదుతాడు.

తాగటానికి సారా దొరక్కపోతే పక్కనున్నవాళ్లని, ప్రభుత్వాన్ని బూతులు తిడ్తాడు.

పైడమ్మ నాలుగు రోజులుగా రాత్రిళ్లు మొగుడి చేతిలో దెబ్బలుతింటోంది.

దెబ్బలుతిన్నందుకు ఆమెకు బాధ లేదు. మొగుడికి అన్నం పెట్టలేకపోయానే అనేది ఆమె బాధ.

ఆ బాధకు కారణం-వొక కుక్క!

"అమ్మా-అన్నం తినకపోతే ఆకలెందుకేస్తుందే? ఆకలికి అన్నానికి సంబంధం ఏమిటసలు? ఆకలిని, అన్నాన్ని దేముడే పుట్టిస్తాడని చెప్పేవుకదా? మరి ఆకలి, అన్నం అందరికీ ఎందుకుండదే? ఆకలి లేనివాళ్లకెందుకు అన్నం ఇస్తాడు? వున్నవాళ్లకెందుకు అన్నం ఇవ్వడు? అసలు అన్నం వున్నవాళ్లకు ఆకలెందుకెయ్యదే అమ్మా...''

కొడుకు ప్రశ్నలు పైడమ్మకు వొక్కటే అర్థం కావు.

ఎనిమిదేళ్ల పిల్లాడు-ఆకలేస్తే అన్నం పెట్టమని అడగడు తల్లిని. ప్రశ్నలు వేస్తాడు. ఆ ప్రశ్నలంటే పైడమ్మకు భయం, సంతోషం, దిగులు-

కొడుక్కు నాలుగుమెతుకులు పెట్టలేకపోతున్నందుకు దిగులు.

తన కొడుకు ఆకలంటూ ఏడవకుండా పెద్దపెద్ద ప్రశ్నలేస్తున్నందుకు సంతోషం.

సమాధానం తెలీని ప్రశ్నలని అడుగుతున్నందుకు భయం-

ఏం చేయాలో తోచక అన్ని భావాలనూ కలగలుపుకొని కొడుకుని వొళ్లోకి తీసుకుని ఏడ్చింది.

వాడి ప్రశ్నలకు, తన ఏడుపుకు కారణం-కుక్క! ఒక మామూలు కుక్క!

గుడిసెలో వొకమూల వున్న రోకలిబండను గదలా చేతిలో పట్టుకొని గుడిసెముందు కూర్చుంది పైడమ్మ-తలుపుకు అడ్డంగా.

తాగుడు అలవాటు కాకముందు నర్సయ్య, పైడమ్మను ఏ పని చేయనిచ్చేవాడు కాదు.

"నీకెందుకే పని? నిన్ను రాణిలా సూసుకొంటానని పెళ్లికి ముందే సెప్పేను నాను"

సూరిబాబు పుట్టేక నర్సయ్యకు తాగుడలవాటయింది. పైడమ్మ మీద మోజుకన్నా సారాపై మోజు పెరిగింది. అతనేదో ఫేక్టరీలో కూలిపని చేస్తుంటాడు.

పైడమ్మక్కూడా కొడుకుపుట్టేక మొగుడిపై మోజు తగ్గింది. సూరిబాబును గొప్పోడిని చేయాలె-

"అయిదేళ్లు నిండనియ్యవే ఏడనో పనిలో యిరికిస్తా. నా అంత గొప్పోడవుతాడు"

"సీ. ఆడ్ని పనిలో సేర్సను. సదివిత్తా-''

"అప్పటికి-సదివినోల్లంతా గొప్పోళ్లనా? ఎదవనాకొడుకులు-మా ఫేక్టరీలో సాలామంది సదివినవోళ్లున్నారు. ఆళ్ల గొప్పేందో నాకు తెల్సు-ఆళ్లందరికన్నా నేను సాలా సాలా సాలా గొప్పోణ్ణి. తెల్సా?"

"అయినాసరే. నేను నా కొడుకును సదివిత్తా"

"అయితే నువ్వు పనిజెయ్యి ఆడ్ని సదివించుకో-"

ఆ తర్వాత భార్యాభర్తలిద్దరిమధ్య వొక ఆర్థిక అంగీకారం కుదిరింది.

జీతంలో నుంచి నెలకింతని ఇస్తాడు నర్సయ్య. మిగతాదంతా అతడి ఇష్టం. పైడమ్మ వాడికి అడిగినప్పుడు అన్నం పెట్టాల.

పైడమ్మకు పాచిపని చెయ్యడం, అంట్లు తోమటం తప్ప మరే పనీ చేతకాదు.

అదృష్టం బాగుండి ఆమెకు పాచిపని చెయ్యటానికి దొరికిన రెండిళ్లూ మంచివే.

ఆ ఇళ్లల్లో జనానికి తినాలన్న కోరిక ఎక్కువ. తినే శక్తి తక్కువ.

అంటే అన్నం ఎక్కువ. ఆకలి తక్కువ.

కనుక, నర్సయ్య అంగీకారాన్ని ఉల్లంఘించి పెళ్లానికి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకపోయినా ఇంట్లో తింటానికి తిండికి లోటు లేకుండానే గడిచిపోతున్నది.

ఆలోచనలోనే పైడమ్మ రెప్పలు వాలేయి. అంతలోనే ఎవరో కొట్టినట్లు ఉలిక్కిపడి కళ్లు తెర్చింది,

అమ్మయ్య! గిన్నెలో అన్నం తెల్లగా మెరుస్తూ అలాగే వుంది.

అన్నం లేకపోతే లేదని వొకటే బాధ. అన్నం వుంటే దాన్ని దాచటానికి తగిన పాత్రలు లేక బాధ. దాన్ని రక్షించుకోవాల్సిన బాధ. కష్టపడి సంపాదించుకున్న ఆ అన్నం కడుపులోకి పోయిందాకా ఎన్నెన్నో బాధలు...

తను పనిచేసేవాళ్ల ఇళ్లల్లో బుల్లివి, చిన్నవి, పెద్దవి, మరీ పెద్దవి ఇలా రకరకాల సైజుల్లో పాత్రలున్నాయి. వాటికి మూతలున్నాయి. పైగా అలమారాలున్నాయి.

అన్నం వున్నవాళ్లకే అన్నీ వున్నాయి.

---

జాజాగాబర్‌ను ఒక స్త్రీ ఒక సలహా అడిగింది.

"నా భర్తను వదులుకోవాలనుకుంటున్నాను. ఇప్పటికే అతను నాకు నగలు, బీరువా, ఒక స్టవ్ ప్రెజెంట్ చేసి వున్నాడు. నేనేమి చెయ్యాలి?"

"స్టవ్ మాత్రం తిరిగి ఇచ్చివెయ్యి."

---

సినిమా టైటిల్స్‌తో సిత్రాలు



అందుకే కుక్కలు కూడా వాళ్ల ఇళ్ళకు పోవు

తనకి గిన్నె వుంటే మూతవుండదు. మూత వుంటే గిన్నె వుండదు. నేలే తనకి అల్మరాలు బీరువాలు... అన్నీ...

అందుకే కుక్కక్కూడా తన ఇల్లు లోకువయింది. తను లోకువయింది.

ఒకరోజా... రెండు రోజులా... వరుసగా నాలుగురోజులు...

ఆ కుక్క తనని బురిడీకొట్టించి అన్నం తినిపోతోంది.

వాళ్లెవరో స్కూల్లోనే కాకుండా పేదోళ్లకు బయట కూడా చదువు చెప్పతాం అంటూ వచ్చారు. డబ్బు ఖర్చు లేదు. పైగా వాళ్లే ఏదో యిస్తాం అన్నారు.

అంచేత సూరిబాబు బడి అయ్యాక అటు నుంచి అటే వెళ్తాడు. ఎనిమిది కొడ్తేకానీ రాడు. యిక నర్సయ్య తొమ్మిది దాటితే కాని రాడు. వాళ్లిద్దరు తినకుండా తనెలా తినటం?

గుడిసె తలుపు బిగించి కొంగుపర్చుకొని వడుం వాల్చేది తను.

పగులంతా పని చేసి అలసి వుండడంతో వొక్క కునుకు... వాళ్లొచ్చేలోగా తీస్తే ప్రాణానికి హాయి. అది తన కలవాటయింది.

కానీ నాలుగురోజులుగా...

ఆ కుక్క తడిక తలుపును ఎలా తీసేదో, లోపలికొచ్చి గిన్నెడన్నం ఎలా మెక్కేదో...

కునుకు తీసి లేచేసరికి గిన్నె ఖాళీ...

మూసుకుపోతున్న రెప్పల్ని బలవంతంగా తెర్చింది. గుండె వొక్క క్షణం దడదడలాడిపోయింది.

ఫర్వాలేదు. ఇంకా ఆ పాపిష్టి కుక్క రాలేదు. గిన్నెడు అన్నం అలాగే వుంది.

కూర్చుని ఆలోచనలో పడ్తే . కళ్లు మూసుకుపోతున్నాయి. ఇ వాళ కునుకు తీయకూడదు. ఏమైనాసరే తన అన్నాన్ని రక్షించుకోవాలి. నర్సయ్యకు, సూరిబాబుకు కడుపునిండా పెట్టాలి.

ఆమెకు అప్పుడెప్పుడో చూచిన జానపద సిన్మాలో రాజుగారి భవనాన్ని కాపలాకాచే భటులు గుర్తుకొచ్చారు.

పైడమ్మ లేచింది. రోక్కలిబండను గదలా బుజం మీద పెట్టుకొని తడిక వాకిలి ముందు అటూ ఇటూ తిరగసాగింది.

సినిమాలో హీరో భటులను చావబాది హీరోయిన్‌కోసం రాజభవనంలోకి వెళ్తాడు.

కుక్కముండ తనని కర్చి లోపలికెళ్లి అన్నం తినిపోదుకదా? కరిచినా సరే తను దాన్ని వదలదు.




ఎన్నాళ్ళ నుంచో అడగవా, వద్దా అని సందేహించి ఒకరోజున సాహసించి రంగయ్య - లింగయ్యను ఈ విధంగా అడిగేశాడు.

"మీ ఇంట్లో తిరిగే బాల వితంతువు మీ భార్యా? మీ తమ్ముడి భార్యా?"

రోకలిబండతో తలపగలకొడ్తుంది.

ఇంతకీ ఆ కుక్క ఎలా వుంటుంది? బలంగా వుంటుందా? బక్కగా వుంటుందా?

సీమకుక్కా? ఊరకుక్కా? ఏదోకుక్క.... ఏదయినా తను దాన్ని వదలదు.

ఏదో శబ్దం వినిపించి 'అలర్ట్' అయింది పైడమ్మ.

చూస్తే కుక్క!

ఎముకలన్నీ పైకి కన్పిస్తున్న బక్కచిక్కిన కుక్క!

నాలికను తెర్చి ఆడిస్తూ, తోకను ఊపుతూ, జాలిగా, దీనంగా చూస్తున్న కుక్క!

పైడమ్మకు ఆ కుక్కను చూడగానే జాలివేసింది. నవ్వొచ్చింది.

ఈ కుక్కను కొట్టటానికే తను ఇంత అట్టహాసం చేసింది?

పైడమ్మను చూస్తూనే కుక్క మెల్లగా రెండడుగులు ముందుకు వేసింది.

"ఛయ్ ... ఛయ్ ..." అనగానే భయంతో పారిపోతుందనుకొంది పైడమ్మ.

కానీ కుక్క మరో రెండడుగులు ముందుకువేసి ఆగింది.

"ఛాయ్-వెళ్లవతలకు. ముదుకొస్తే ఛస్తావ్" రోకలిబండ వున్న చేతిని కదల్చకుండా రెండో చేయిని పైకెత్తి అంది.

కుక్క తనని తాను కుంచించుకొని, మెల్లగా మూలుగుతూ, పైడమ్మ వైపే చూస్తూ మెల్లగా మరో మూడడుగులు ముందుకు వేసింది.

పైడమ్మకు యీసారి కోపం వచ్చింది.

తను... ఎద్దంత కాకపోయినా ఏదో విధమైన మనిషి, పైగా రోకలిబండ అనే ఆయుధాన్ని ధరించివున్న మనిషి... తను వాకిలికి అడ్డంగా నిలబడి వుండగానే లోపలికెళ్లటానికి ముందుకు రావటమా? ఈ కుక్కకు పిచ్చా! చాదస్తమా? అసలు ప్రాణం మీద ఆశ వుందా?

"ముందుకు ఇంకొక్క అడుగేస్తే సంపుతా పో... అవతలికి. నాలుగురోజులు మెక్కేవు-సాలదూ?" రోకలిబండ పైకెత్తి తవొక అడుగు ముందుకేస్తూ కోపంగా అంది పైడమ్మ.

అయినా కుక్క మరో రెండడుగులు ముందుకేసింది. పైడమ్మకు చాలా దగ్గరిగా వచ్చింది. అంటే వాకిలిదాకా వచ్చిందన్నమాట!

అన్నం రుచిమరిగిందికదా-మొండికేస్తున్నది. ఒక్కదెబ్బ తగిలితేసరి...

కోపంతోనే రోకలిబండతో వొక్కదెబ్బ వేసింది.

కుక్క బాధతో మూలుగుతూ నేలకు అంటుకు పోయింది.

"పోతావా. మరోటి తగిలించమంటావా?" రోకలిబండ పైకెత్తింది పైడమ్మ.

కానీ కుక్క భయంతో వెనుదిరిగి పారిపోలేదు.

చిత్రమైన వొక కదలికతో ముందుకి దూసుకుపోయింది.

పైడమ్మ నివ్వెరపోయిందొక్క క్షణం. అంతలోనే భర్త, కొడుకు గుర్తుకొచ్చారు.

కుక్క మీద విపరీతమైన కోపం వచ్చింది. కుక్క వెనుక పరుగెత్తింది.

కుక్క అప్పటికే వాకిలి వద్దకి చేరింది. వొక్క అంగలో దాన్ని చేరుకొని అమిత ఆవేశంతో దాని నడుం మీద బలంకొద్దీ వొక్క దెబ్బ కొట్టింది.

కుయ్యో మొర్రో అంటూ కుక్క పెద్దగా అరిచింది. ప్రాణం పోయినట్టు గిలిగిల తన్నుకుంటూ పెద్దగా కేకలు పెట్టింది.

"పోతావా... పోవా..."

మరోటి... మరోటి...

కుక్క దెబ్బలు తింటూనే గుడిసె లోపలికి ప్రవేశించింది.

అమాంతం గిన్నె దగ్గరికెళ్లి మూత తోసేసింది.

పైడమ్మ తన కళ్లను తానే

నమ్మలేకపోతోంది. తన కళ్ల ఎదుటే తన అన్నాన్ని కుక్క దౌర్జన్యంగా తినబోతోంది. ఈ రోజు కూడా తన బిడ్డ, భర్త ఆకలితో మాడాల్సిందే

ఆమె కాళికగా మారింది. దుర్గావతారాన్ని ఎత్తింది.

కుక్కను బాదసాగింది.

అయినా కుక్క అన్నాన్ని వదలలేదు. మూతను నెట్టేసి తినసాగింది.

పైడమ్మ కుక్కను శాపనార్థాలు పెడ్తోంది. కొడ్తోంది.

కుక్క దెబ్బలు తింటోంది - ఇష్టం లేకుండా. కానీ ఇష్టంగా ఆవురావురని అన్నాన్ని తింటోంది.

అదొక చిత్రమైన పోరాటం

అన్నం కోసం మనిషికి, కుక్కకు మధ్య జరుగుతున్న మహత్తర పోరాటం.

తన అన్నాన్ని రక్షించుకోవాలని మనిషి పోరాటం.

ఎన్ని కష్టాలకైనా వోర్చి అన్నాన్ని తినాలని కుక్క పోరాటం...

చివరికి ఆ పోరాటంలో కుక్కే గెలిచింది.

కొట్టి కొట్టి పైడమ్మ చేతులు అలసిపోయాయి. కసి... ప్రతీకారవాంఛ...

తన అన్నాన్ని తన ఎదుటే తిన్న కుక్క బతకకూడదు. దాన్ని చంపెయ్యాలి.

కసితో బలాన్నంతా రెండు చేతుల్లోకి తెచ్చుకొని రోకలిబండనెత్తి కుక్క తలపై వజ్రాయుధంలా ప్రయోగించింది.

కుక్క తల చిట్లింది. రక్తం కారసాగింది.

అప్పటికె గిన్నె ఖాళీ అయింది. అంచేత కుక్క బాధతో అరుస్తూ వెనక్కి తిరిగి పరుగెత్తలేక పరుగెత్తలేక పరుగెత్తసాగింది.

పైడమ్మ కచ్చ తీరలేదు. ఆ కుక్కను చంపాలి. చంపాలి...

అంచేత రోకలిబండను చేతుల్లో పట్టుకొని కుక్కవెంట పరుగెత్తసాగింది.

... ... ...

కుక్క వెళ్లి వెళ్లి వొక మునిసిపాలిటీ చెత్తకుండీ దగ్గర ఆగింది.

ఆగి అదోరకంగా మొరిగింది. మూలిగింది. అరచింది.

చెత్తకుండీ వెనకవైపు నుంచి నాలుగు బుజ్జి కుక్కపిల్లలు వచ్చాయి.



## కొలెస్ట్రాల్‌కు పరమౌషధం "వైన్"

రక్తంలో 'కొలెస్ట్రాల్' పెరిగితే గుండె పోటు, గుండె జబ్బులు రావచ్చునంటారు. కొవ్వు పదార్థాలను, తీపి పదార్థాలను ఎక్కువగా తినే వారిలో కొలెస్ట్రాల్ ఎక్కువగా వుంటుందని నిపుణులు చెబుతూ వుంటారు. దీనితో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గించుకోడానికి ఎన్నో చిట్కాలు (వ్యాయామం చేయడం వంటివి) ప్రయోగిస్తూ వుంటారు. యిప్పుడు ఏ మాత్రం కష్టపడకుండా రక్తంలో "కొలెస్ట్రాల్"ని తగ్గించే పరమౌషధాన్ని పరిశోధకులు కనిపెట్టారు. అదేమిటో తెలుసా? 'వైన్' - అంటే ద్రాక్షా సవం!!

"వైన్"లో కొలెస్ట్రాల్‌ని తగ్గించే రసాయనిక పదార్థం వున్నట్టు పరిశోధనలలో తేలింది. ఎర్ర ద్రాక్షా సవంలో ఈ రసాయన పదార్థం ఎక్కువగా వుందట! తెల్ల ద్రాక్షా సవంలో తక్కువగా వుందట! అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో తయారయ్యే దాక్షా సవంలో కన్నా న్యూయార్క్ రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ద్రాక్షా సవంలో మూడు రెట్లు ఈ రసాయనిక పదార్థం వుందని కనుగొన్నారు.

కుక్కచుట్టూ చేరి సన్నగా మొరుగుతూ దాని కాళ్లు నాకసాగేయి.

కుక్క బాధ భరించలేనట్లు గిలగిలలాడుతూంది. కిందపడి పొర్లుతోంది. అంతలోనే లేస్తోంది. మళ్ళీ పొర్లుతోంది. దాని రక్తంతో బుజ్జికుక్కల శరీరాలు ఎర్రబడ్డాయి.

ఉన్నట్లుండి కుక్క భళ్లున కక్కింది.

అన్నం... అంతకుముందు తిన్న అన్నం బయటికొచ్చేసింది.

కానీ రక్తపు చుక్కలుపడి తెల్లటి ఆ అన్నం మెతుకులు కూడా ఎర్రగా మారేయి.

అయినా ఆ అన్నం మీదికి బుజ్జి కుక్కలు ఎగబడ్డాయి. తల్లిని వొదిలేసి ఆవురావురుమని అన్నం తినసాగాయి.

పైడమ్మ ఆ దృశ్యాన్ని చూచింది.

చేతిలో రోకలిబండ ఆమెకి తెలీకుండానే జారి కింద పడింది.

కుక్కను ఆమె క్షణకాలం దీనంగా చూచింది.

కిందపడి గిలగిలా తన్నుకొని నేలమీద వాలిపోయింది.

ఒక్కక్షణం అంతా నిశ్శబ్దం-

పైడమ్మ వొక్కసారిగా కుప్పకూలిపోయింది. మోకాళ్ల మధ్య మొహాన్ని దాచుకొని బిగ్గరగా ఏడవసాగింది.

... ... ...

"ఏన్ అన్ సైంటిఫిక్ స్టోరీ. కుక్కలకు మాతృప్రేమలుండవు నాయనా. పిల్లల్ని పోషించే బాధ్యతని తీసుకోవు" జువాలజీ లెక్చరర్ రవి అన్నాడు.

"మేబీ. దటీజ్ ఎజువలాజికల్ రూల్స్. బట్ ఈ కథ నిజంగా జరిగింది. కనుక నా కథలో కుక్క వొక ఎక్సెప్షన్"

"స్వీ ట్! ఈ కథ చెప్పి ప్రిన్సిపాల్ చేత మధుకు ప్రావిడెంట్‌ఫండ్ లోన్ శాంక్షన్ చేయించగలవా?"

"నో నో. అది ఆ బ్రహ్మతరం కాదు. ఎందుకంటే మన ప్రిన్సిపాల్ రూల్స్‌కి ఎక్సెప్షన్ లాంటివాడు"

"ఏంటో నీ గోల. కాస్త వివరంగా చెప్పు"

"భర్తలేని తల్లి కొడుక్కు డిపెండెంట్ అన్నది యూనివర్సల్ రూల్. ఆ రూల్‌ని కాదన్న మన ప్రిన్సిపాల్‌కాని, మరెవరైనా కానీ దానికి ఎక్సెప్షన్."

"అయితే మనమేం చేయాలిప్పుడు?"

"ఏదో వొకటి చేయాలి. కానీ మనకి వాక్‌శూరత్వం తప్ప క్రియాశీలత్వం లేదుకదా? అంచేత అందరం కల్సి తూర్పుకు తిరిగి దణ్ణం పెట్టాలి" అంటూ చివాలున లేచి వెళ్లిపోయాడు సాంబశివం. ●●